

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు


దివాకర్, తహశీల్దార్

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని ఆయా గ్రామాల గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఈ నెల 10 నుంచి 24వ తేదీ వరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ వివిఎస్.దివాకర్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 10న ఉప్పలగుప్తం, 11న చల్లపల్లి, 12 న భీమనపల్లి, 13 న ఎన్.కొత్తపల్లి, 17 న ఎస్.యానాం, 18న గొల్లవిల్లి, 19న చినగాడవిల్లి, మునిపల్లి, 20 న సన్నవిల్లి, పెదగాడవిల్లి, గోపవరం, 21న కూనవరం, 24న విలసవిల్లి పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వ హిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గోపిమూర్తిదే గెలుపు

- ఎంఎల్‌సి ఎన్నికల్లో ఘన విజయం
- మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే గెలుపు
- 9,165 ఓట్లను సాధించిన పిడిఎఫ్ అభ్యర్థి
- ప్రత్యర్థి నారాయణరావుపై 3,906 ఓట్ల మెజారిటీ


ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న గోపిమూర్తి



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి ఉభయ గోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో బొర్రా గోపిమూర్తికే గురువులు ఫస్ట్ ర్యాంకును ఇచ్చారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లలోనే ఆయనకు ఘన విజయాన్ని అందించారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు సోమవారం కాకినాడ జెఎన్‌టియు ప్రాంగణలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎన్నికల పరిశీలకులు కె.హర్షవర్ధన్, రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, జెసి రాహుల్ మీనా, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ ఎన్నికలో మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీ పడ్డారు. 16,737 మంది ఓటర్లకు 15,494 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో 814 ఓట్లు చెల్లనివిగా అధికారులు ధ్రువీకరించారు. మిగిలిన 14,680 వ్యాలిడ్ ఓట్లలో విజయానికి అవసరమైన కోటా ఓట్ల సంఖ్య 7,341న గోపిమూర్తి తొలి రౌండ్‌లోనే అధిగమించి విజయాన్ని సొంత చేసుకున్నారు. రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆయనకు ధ్రువపత్రాన్ని అందించారు. సమీప ప్రత్యర్థి నారాయణరావుపై 3,906 ఓట్ల మెజారిటీని గోపిమూర్తి సాధించారు.

విజయోత్సవ ర్యాలీ

లెక్కింపు పూర్తయిన వెంటనే పలువురు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, యుటిఎఫ్ నాయకులు, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు జెఎన్‌టియుకె వద్దకు చేరుకున్నారు. పూలమాలలతో గోపిమూర్తికి ఘనంగా స్వాగతం పలికారు. జెఎన్‌టియుకె నుంచి భానుగుడి, కలెక్టరేట్ మీదుగా బైక ర్యాలీతో యుటిఎఫ్ హోమ్‌కు చేరుకున్నారు. పిడిఎఫ్ జిందాబాద్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.


నాయకుల అభినందన


ర్యాలీగా...

అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

అభ్యర్థి పేరు	వచ్చిన ఓట్లు
బొర్రా గోపిమూర్తి	9165
జి.నారాయణరావు	5259
పులుగు దీపక్	102
కవల నాగేశ్వరరావు	73
నిమ్మల వెంకటలక్ష్మి	81


విజయోత్సవ సభలో మాట్లాడుతున్న గోపిమూర్తి

ఇది అందరి విజయం

గోపిమూర్తి విజయోత్సవ సభలో వక్తలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

టీచర్స్ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి విజయానికి అనేక మంది ఎంతో కష్టి చేశారని ఇది అందరి విజయం అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో సోమవారం గోపిమూర్తి విజయోత్సవ సభ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అన్నారం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడారు. గోపిమూర్తి విజయం వెనక యుటిఎఫ్‌తో పాటు అనేక ప్రజా, కార్మిక సంఘాలు నిరంతరం పని చేశాయన్నారు. పిడిఎఫ్‌గా ఇది హ్యాట్రిక్ విజయం అని తెలిపారు. ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ పక్షాన ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో పిడిఎఫ్ తరపున రాష్ట్రంలో ప్రజా సమస్యలపైనా గళం విప్పుతామని స్పష్టం చేశారు.

విజయం సాధించిన గోపిమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది యుటిఎఫ్ స్వర్ణోత్సవాల వేళ ఈ విజయం మరువలేనిదన్నారు. కొంత మంది కార్పొరేట్ అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేసినప్పటికీ మెజారిటీ ఓటర్లు తన వైపు నిలబడి భారీ విజయాన్ని అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా పిడిఎఫ్‌ను ఢీకొట్టే అభ్యర్థులు ఉండబోరని మరోసారి నిరూపించారన్నారు. పెద్దల సభలో ప్రజా సమస్యలపై నిరంతరం గళం విప్పుతానని హామీ ఇచ్చారు. నీతికి నిజాయితీకి పట్టం కట్టిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. మార్చిలో జరగబోయే పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానాన్ని కూడా తిరిగి మనమే సాధించాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన అన్నారం మాట్లాడుతూ ఇదొక చారిత్రక విజయం అన్నారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు చిట్టిబాబు మాట్లాడుతూ ఈ విజయం సామాన్య విజయం కాదన్నారు. కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం రాష్ట్ర నాయకులు మాణిక్యం, సుందరయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిరంతరం పనిచేస్తున్నారన్నారు అటువంటి వ్యక్తులను శాసన మండలికి పంపించడం అందరి బాధ్యత అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గోపిమూర్తి విజయం సాధించిన తర్వాత యుటిఎఫ్ కి మరింత బాధ్యత పెరిగిందన్నారు. హ్యాట్రిక్ విజయాన్ని సాధించిన ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్యం పట్ల నమ్మకం ఉన్న వారందరూ ఈ విజయంలో భాగస్వామ్యం పొందారన్నారు. ప్రజా ఉద్యమం కోసం పనిచేసే వారికి యుటిఎఫ్ ఎప్పుడూ సహకారం అందిస్తుందన్నారు. తొలుత అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఎల్‌సిలు ఐవి, గోపిమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.జ్యోతిబసు, కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగేష్, టి.చక్రవర్తి, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై గళం విప్పుతా...

మీడియాతో గోపిమూర్తి

ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన తాను ఇక నుంచి ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై, ప్రజా సమస్యలపైన శాసన మండలిలోనూ గళం విప్పుతానని ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి తెలిపారు. సోమవారం కౌంటింగ్ పూర్తయిన తరువాత ఆయన జెఎన్‌టియుకె ఆవరణలో మీడియాతో మాట్లాడారు. కార్పొరేట్ అభ్యర్థులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా గురువులు నిజాయతీకే పట్టం కట్టారన్నారు. భారీ మెజారిటీని అందించి ప్రజాస్వామ్య విలువల్ని కాపాడినందుకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఇప్పటికే వివిధ ఉపాధ్యాయ సమస్యల పరిష్కార కోసం తాను అనేక పోరాటాలు చేశానని, భవిష్యత్తులో తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానన్నారు. ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ టీచర్లకి సంబంధించి జిఒ 3ని సుప్రీంకోర్టు కొట్టి వేసిందన్నారు. దానికి చట్టబద్ధత కల్పించేలా ఎన్నికల్లో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. దానిని అమలు చేయాలన్నారు. కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రటాక్ట్ లెక్చరర్స్‌ను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. గెస్ట్ లెక్చరర్లు, అధ్యాపకేతర సిబ్బందికి మినిమం టైమ్స్ స్కేల్ అమలు చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వాటిని తక్షణం విరమించుకోవాలని కోరారు. సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న విద్యా రంగానికి ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో గురువుల సంక్షేమానికి నిధులు కేటాయించట్లేదన్నారు. వారికి ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే సెలవులు, టైం స్కేల్‌ను అందించాలన్నారు. వారికి హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ప్రజల పక్షాన శాసనమండలిలో తన గొంతును వినిపిస్తానని తెలిపారు. బోధనేతర పనులను నిలిపేయాలన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించకుండా కంప్యూటర్ ఆపరేటర్‌ను ఇవ్వకుండా ఉపాధ్యాయులతో ఈ పనులు చేయించడం తగదన్నారు.



అర్జీల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను రీఓపెన్ కు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వ హించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మహేష్‌కమార్, జెసి టి.నిషాంతి, డ్వామా పీడీ మధుసూదన్, ఐసిడిఎస్ పీడీ ఝాన్సీ రాణిలు అర్జీదారుల నుంచి 168 అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసంలో సామాజిక భద్రత పింఛన్ల మం జూరు, వైద్య సేవలు కల్పన, భూసమస్యలు, తదితర అంశాలపై అందాయి. ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి 15 రోజుల కాల వ్యవధిలో పరిష్కరించాలని, సిఎం, మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికై నోడల్ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదుల పరిష్కార విషయంలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించాలన్నారు. ప్రజా ఫిర్యాదులు పరిష్కరించే సందర్భంలో అర్జీదారులకు ఎప్పటి కప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. మండల స్థాయిలో వచ్చే ఫిర్యాదు లను మం డల స్థాయిలోనే పరిష్కరించేలా చూడాలన్నా రు. ఇప్ప టికే పెండింగ్లో ఉన్న దరఖాస్తు లపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరిం చాల న్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలకు వినతి

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడిలో రైల్వే బ్రిడ్జి,రోడ్డు బ్రిడ్జిల సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలంటూ సోమవారం స్థానికులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తోపాటు తహశీల్దార్ వైవి.సుబ్రహ్మణ్యాచార్యులకు వినతిపత్రం అందజేశారు. ఉచిత ఇసుక పాలసీని అడ్డం పెట్టుకుని కొందరు స్థానిక నాయకులు స్థానిక అధికారుల సహకారంతో అక్రమంగా అమ్మకాలు సాగిస్తూ భారీగా వసూలు చేస్తున్నారని అన్నారు. ఇసుక అక్రమ అమ్మకాలను నిలుపుదల చేయాలని, ఇసుక తీసే కార్మికులకు రేటు నిర్ణయించి వారే ట్రాక్టర్లకు ఎగుమతి చేసి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రజల అవసరాలు తీర్చేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, నానాజీ, రమేష్ పాల్గొన్నారు.

ఈ భారాలు మోసేదెలా..?

- ఎఫ్‌పిపిసిఎ పేరిట అదనపు వసూళ్లు
- ఒక్కో బిల్లుపై పై రూ.100 నుంచి
- రూ.400 వరకూ భారం

ఉంగరాల శాంతి సరస్వతి రాజమండ్రిలో నివాశం ఉంటుంది. ఇంటికి నవంబర్ నెలలో రూ.580 కరెంటు బిల్లు చెల్లించింది. డిసెంబర్ నెల విద్యుత్ బిల్లు ఏకంగా రూ.941 రావడంతో అవాక్కైంది. డిసెంబర్ నెలలో 117 యూనిట్లకు ఎనర్జీ ఛార్జి రూ.486.69, ఫిక్స్‌డ్ ఛార్జి రూ.30, కస్టమర్ ఛార్జి రూ.45, ఇడి ఛార్జి రూ.7.02 మొత్తంగా రూ.568.69 అయ్యింది. అయితే ఇదే బిల్లులో ఎఫ్‌పిపిసిఎ 397.22, ఎఫ్‌పిపిసిఎ-2 రూ.82 రెండూ కలిపి అదనంగా రూ.479.22 పడింది. గవర్నమెంట్ సబ్సిడీ రూ.106 పోను మొత్తంగా ఈ నెల బిల్లు రూ.941 వచ్చింది. వాడుకున్న కరెంటుకు సంబంధించి రూ.568 బిల్లుకాగా ఎప్‌పిపిసిఎ సర్‌ఛార్జీల పేరిట అదనంగా రూ.479.22 వసూలు చేయడంతో ఆందోళన చెందుతుంది. వాడకం ఛార్జీల కంటే సర్ ఛార్జీలు ఎక్కువ అయ్యిపోయాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తుంది.


NAME KAMUJUDHANA .
ADDR 71-16-2POLICE QUATER.
CAT :1 PH :1
SCAT : LT Domestic - Domestic
CONTRACTED LOAD 3.0KW
CONNECTED LOAD 3.0KW
MNo 5641019 MF:1.0

READING		MONTH	STS
PRES KWH	9714	06-12-2024	1
PREV KWH	9597	07-11-2024	1
AVG UNITS			217
BILLED UNITS			117
RMD			1.34KVA

ENERGY CHRG	486.69
FIXED CHRG	30.00
CUST CHRG	45.00
ED	7.02
SURCHARGES	0.00
ED INT	0.06
TRUEUP CHRG	0.00
FPPCA CHRG	397.22
FPPCA2 CHRG	82.00
SHORTFALL	0.00
ACD SURCHRG	0.00
FAN INSTAL	0.00
ADJ AMOUNT	0.00
LOSS/GAIN	0.01
BILL AMOUNT	1048.00
GOVT SUBSIDY	106.00
BILL AFT SUB	942.00
ISD-TDS :	0.00
ARREARS BEF 01/04/24	0.00
AFT 01/04/24	-0.01
NET BILL	941.99
DUE DATE	20-12-2024
DISC DATE	05-01-2025
E&OE	For AAO/ERO
SD AVAILABLE	600
ACD TO PAY	0.0

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కోనాల రామకృష్ణ బిక్కవోలులో నివాసం ఉంటున్నాడు. ఆయనకు నవంబర్ బిల్లులో 252 యూనిట్లకు రూ.1,442 వచ్చింది. ఇందులో ఎఫ్‌పిపిసిఎ-2 ఛార్జి రూ.84 వేశారు. శీతాకాలం కావడంతో నవంబర్‌లో కరెంటు వాడకం తగ్గించారు. 203 యూనిట్లు వాడారు. దీనికి సంబంధించి డిసెంబర్‌లో రూ.1,176 బిల్లు వచ్చింది. ఇందులో ఎఫ్‌పిపిఎ ఛార్జి పేర రూ.106.36, ఎఫ్‌పిపిసిఎ -2 పేర మరో రూ.89 వసూలు చేశారు. వాడుకున్న దానికంటే అదనంగా రూ.195 చెల్లించాల్సి వచ్చిందని వాపోయాడు. రామకృష్ణ, శాంతి సరస్వతిలకే కాదు ఇలా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 18.58 లక్షల వినియోగదారులపై సర్‌ఛార్జీల భారం పడింది.

ఎన్నికల సమయంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంట్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారు. కాని అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే సర్‌ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరిట ప్రజలపై భారాన్ని మోపారు. నవంబర్‌లో ఎఫ్‌పిపిసిఎ పేరిట మాత్రమే అదనపు ఛార్జీ పడగా డిసెంబర్‌లో వచ్చిన బిల్లులో ఎఫ్‌పిపిసిఎతో పాటూ ఎఫ్‌పిపిసిఎ-2తో అదనపు వసూళ్లు చేస్తున్నారు. ఇదేంటి అని ప్రశ్నిస్తుంటే బదులిచ్చే నాథుడే కరువవుతున్నారు. శీతాకాలం నేపథ్యంలో విద్యుత్ వాడకం గణనీయంగా తగ్గింది. అయినప్పటికీ డిసెంబర్ నాటి కరెంట్ బిల్లుల్లో మాత్రం తగ్గుదల కనిపించలేదు. కారణం ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలే. విద్యుత్ యూనిట్ ధర పెంచకుండా సర్దుబాటు ఛార్జీల పేరుతో ఇలా అడ్డగోలుగా ప్రభుత్వం ప్రజలను దోచేస్తోంది. ఒక్కో బిల్లుపై ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు రూ.100 నుంచి రూ.400 వరకూ వేస్తున్నారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులపై రూ.18 కోట్ల నుంచి రూ.74 కోట్ల వరకూ భారం పడనుంది. ఇప్పటికే ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సర్‌ఛార్జీల భారం మూలిగేనక్కపై తాటిపండు పడ్డ చందాన ఉంది.

పెంచబోమని చెప్పి భారాలు వేస్తున్నారు

కరెంట్ బిల్లులు పెంచబోమని ఎన్నికల సమయంలో చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే కరెంటు ఛార్జీల భారం వేయడం చాలా దారుణం. సర్‌ఛార్జీల పేర ఇలా భారాలు వేయడం తగదు. వెంటనే సర్ ఛార్జీని రద్దు చేయాలి.

- కర్రి అచ్చిరెడ్డి, బలభద్రపురం

ఈ నెల రూ.139 అదనంగా వచ్చింది

ప్రతి నెలా 210 నుంచి 230 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తున్నాము. ఆర్యాపురంలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాము. సర్వీసు నెం.143202220 4007877 సర్వీసు నెంబరుకు గత నెల రూ.950నుంచి రూ.1100 వరకూ బిల్లు వచ్చేది. ఈ నెల రూ.1239బిల్లు వచ్చింది. గత నెలతో పోల్చితే విద్యుత్ వినియోగం పెరగలేదు. అయినప్పటికీ సుమారు రూ.150 అదనంగా బిల్లు వచ్చింది.

- బి.రాజేశ్వరి, గృహిణి, రాజమండ్రి


వినియోగం తగ్గినా అదనంగా బిల్లు



ప్రతి నెలా సుమారుగా 100 యూనిట్లు విద్యుత్‌ను వినియోగిస్తుంటాము. గోకవరం బస్టాండ్ వద్ద చిరువ్యాపారం చేసుకుంటూ జీవని సాగిస్తున్నాం. మా సర్వీసు నెం.1432022204103839 నెంబరుకు గత నెల 99 యూనిట్లు విద్యుత్ వినియోగించగా రూ.1044 కరెంటు బిల్లు జారీ చేశారు. ఈ నెల 93 యూనిట్లు మాత్రమే విద్యుత్ వినియోగించినప్పటికీ రూ.1077 బిల్లు జారీ చేశారు. 6 యూనిట్లు విద్యుత్ వినియోగం తగ్గినప్పటికీ రూ.67 బిల్లు అదనంగా వచ్చింది.

బివి.పద్మావతి, చిరు వ్యాపారి, గోకవరం బస్టాండ్,

కార్టూ'నిజం'



రహదారిలో కల్వర్టు విస్తరణకు చర్యలు

పంచాయతీరాజ్ డిఇ సూర్యనారాయణ


బివి.లంక రహదారి కల్వర్టు స్థితిగతులను పరిశీలిస్తున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి - ఆలమూరు

బివి.లంక రహదారిలో కల్వర్టు విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ డిఈ ఏ.వి.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని బడుగువానిలంకకు ఏటిగట్టు నుంచి గ్రామంలోకి వెళ్లే సుమారు కిలోమీటరు మేర ప్రధాన రహదారికి ఇరువైపులా రూ. 30 లక్షలతో సిసి రోడ్డుతో విస్తరణ పనులు జరుగుతుండగా సోమవారం ఆయన పరిశీలించారు. అయితే ఈ రహదారి మధ్య గోదావరి పాయలో రెండు కల్వర్టులు గతంలో నిర్మించగా వాటిలో ఒకటి రహదారి విస్తరణకు అనుకూలంగా ఉండగా, మరొకటి వెడల్పు చిన్నదిగా ఉందన్నారు. అయితే వరదల సమయంలో రెండు కల్వర్టులు గోదావరిలో మునిగిపోతూ ఉంటాయని, నడిచి వెళుతున్న గ్రామస్తులు చిన్న కల్వర్టు వద్ద అదుపుతప్పి గోదావరిలో కొట్టుకుపోవడంతో కొందరు ప్రాణాలు కోల్పోగా మరికొందరు బయటపడ్డారని తనకు వివరించారన్నారు. దీనిపై గ్రామానికి చెందిన కూటమి నాయకులు దూలం రాంబాబు, పాలూరి గోవిందరాజు, పడాల అమ్మిరాజు కొత్తపేట ఎంఎల్ఎబండారు సత్యానందరావు దష్టికి తీసుకుని వెళ్లారని తెలిపారు. స్పందించిన ఎంఎల్ఎ ఆదేశాలతో ప్రమాద స్థలాన్ని పరిశీలించామన్నారు. కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి అనుమతులకు పంపించి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ డిఇ తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు జరిగినట్లు వివరాలు సేకరించుకుని వెళ్లారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ వంశీ ఉన్నారు.



రాయుడుపాలెంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులు

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండలంలోని భీమనపల్లి పంచాయతీ రాయుడుపాలెంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సోమవారం ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలో జ్వరాలు సోకుతున్నాయన్న సమాచారంతో భీమనపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా చేపట్టిన చర్యల్లో భాగంగా ఎబేట్ మందు ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె. రామకృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సోనియా పుట్టినరోజు వేడుకలు



నగరంలో కేక్ కట్ చేస్తున్న డిసిసి అధ్యక్షుడు చిట్టిబాబు

ప్రజాశక్తి - మామిడికుదురు

ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ 78వ పుట్టినరోజు వేడుకలను నగరంలో పి.గన్నవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంఎల్ఎ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు కేకు కట్ చేసి సోనియాగాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం అందరికీ స్వీట్లు, కేకు పంచారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు అప్పన్న శ్రీరామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయ కులు ఎపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్, పిసిసి సభ్యురాలు ధోనిపాటి విజయలక్ష్మి, వానరాశి దొర బాబు, కొండేటి స్టాలిన్ బాబు, చిట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం: స్థానిక వింటేజ్ లాడ్జి నందు సోనియా గాంధీ పుట్టినరోజు వేడు కలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు పిలుపుమేరకు ఈ వేడుకలను అమలాపురం అసెంబ్లీ నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అయితా బత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎపిసిపి ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, వంటెద్దు బాబి, ఎఐసిసి సభ్యులు యార్లగడ్డ రవీంద్ర, ముషిణి రామ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మహిళ అదృశ్యమైన ఘటనపై సోమవారం పోలీసులు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. నగర పంచాయతీ పరిధిలోని రాయుడు పాలెం చెందిన బొక్కా విజయ రాజు తల్లి వెంకటరమణ అనారోగ్యంతో బాధపడుతోంది. రెండు రోజుల క్రితం ఆమె ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కోసం బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ తెలియలేదని ఆమె కుమారుడు విజయ రాజు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న వ్యక్తి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన తోట త్రిమూర్తులు(30) మానసిక వ్యాధితో బాధ పడుతున్నాడు. అదుపు మందులను వాడుతున్నాడు. 20 రోజులుగా మందులను వాడటం మానేశాడు. దీంతో మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో అతడు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే ఆతనిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న నేపథ్యంలోనే అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధి మామిడాడ గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. అలాగే ఒక వ్యక్తి నుంచి 11 అక్రమ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానాలు, జైలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు, ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 12 మందికి రూ.10 వేలు చొప్పున ప్రత్తిపాడు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కాటం భాను జరిమాన విధించారని సిఐ సిఐ సూర్యఅప్పారావు తెలిపారు. అలాగే మరో ఇద్దరికి 7 రోజులు చొప్పున జైలు శిక్షను విధించారని తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు.

గుర్తు తెలీని వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు-కొవ్వూరు రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం చేసుకున్నట్లు జిఆర్‌పి హెచ్‌సి శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడు కుడి చేయిపై ఈశ్వర్ అనే పచ్చబొట్టు ఉందని, కుడిచేయి జబ్బ మీద త్రిశూలం, నాగుపాము, డమరుకం గుర్తులు కలిగిన పచ్చబొట్టు ఉన్నాయని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తాడేపల్లిగూడెం జిఆర్‌పి హెచ్‌సి తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే 9490617090, 9948010061 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

గోపిమూర్తి విజయంతో యుటిఎఫ్ సంబరాలు


ఆలమూరులో ఉపాధ్యాయులకు స్వీట్లు అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉభయ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల లెక్కింపు సోమవారం కాకినాడ జెఎన్‌టియులో నిర్వహించారు.ఈ ఓట్ల లెక్కింపులో పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజయం సాధించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు.

ఆలమూరు: గోపి మూర్తి గెలుపుతో సోమవారం సాయంత్రం యుటిఎఫ్ ఆధ్వర్యంలో కృతజ్ఞత పూర్వక సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం బలపరిచిన బొర్రా గోపి మూర్తిని అఖండ మెజారిటీతో గెలిపించిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఇంతటి అపూర్వ విజయాన్ని అందించడంలో సహాయ సహకారాలు అందించిన యావన్మంది కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ స్వీట్లు పంపిణీ చేశారు. వారితో మండల అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జొన్నాద మనోజ్ కుమార్, ఆర్థిక కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి వైవివి.రమణ, జిల్లా ఎఫ్‌డబ్ల్యుసి మెంబర్ వివివి జిఎస్ఎన్.మూర్తి, తదితరులు ఉన్నారు. **అయినవిల్లి:** పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి అఖండ మెజారిటీతో గెలుపొందడంపట్ల యుటిఎఫ్ అయినవిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ముక్తేశ్వరం సెంటర్ లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.మురళీశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పిఎస్.నాగేంద్ర రావు, గౌరవ అధ్యక్షులు జి. సాయి శ్రీనివాస్, అధ్యక్షులు టి.ఈశ్వరరావు, కోశాధికారి యమ్.కిరణ్ బాబు, సంక్షేమ పథకం డైరక్టర్ బి.శ్రీనివాస రావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** యుటిఎఫ్ ఆధ్వర్యంలో మామిడి కుదురు ఎంఆర్‌సి కార్యాలయము వద్ద సోమవారం చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సభ, ఉభయగోదావరి జిల్లాల టీచర్ల ఎంఎల్‌సిగా పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి ఘనవిజయం సాధించిన సందర్భంగా విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభకు మండల శాఖ అధ్యక్షులు జి.నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించగా ఎంఇఒ ఎస్‌విఎస్.లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి సిహెచ్.కేశవరావు, సీనియర్ నాయకులు, కె.సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ముక్తేశ్వరంలో యుటిఎఫ్ నాయకుల విజయోత్సవ ర్యాలీ


మామిడికుదురులో విజయోత్సవ సభ


పాపారావు ఆధ్వర్యంలో మురళీకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ఘనంగా మురళీకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రానికి చెందిన పారిశ్రామికవేత్త, శ్రీమురళీకృష్ణ సంస్థల అధినేత, కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు తనయుడు వంటిపల్లి మురళీకృష్ణ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను పెద్దపళ్ల శ్రీ మురళీకృష్ణ రైస్‌మిల్, ఈతకోట శ్రీకృష్ణ రైస్ మిల్ స్టాఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వారంతా మురళీకృష్ణకు పూలమాలలు బొకేలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురళీకృష్ణ సంస్థల ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో సంస్థ అధినేతలు వంటిపల్లి కృష్ణమూర్తి, వంటిపల్లి పాపారావు, కుటుంబ సభ్యులు, సంస్థ స్టాఫ్ పాల్గొన్నారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం


కె.గంగవరంలో నిర్వహించిన వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

భవిత కేంద్రాల్లో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరంలో సోమవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా భవిత కన్వీనర్ కోఆర్డినేటర్ ఎంబిబి సత్యనారాయణ మాట్లాడుతూ వికలాంగులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం భవిత కేంద్రాలు ఏర్పాటుచేసి అనేక సదుపాయాలు కల్పిస్తోందని వాటిని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి వెంకటేశ్వర మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా భవిత కేంద్రాల్లో ఉన్న అందరి పిల్లలకు రవాణా భత్యాన్ని ఇప్పటికే అందజేశామన్నారు. ఈ సందర్భంగా వికలాంగలకు అందరికీ స్థానిక దాతలు బహుమతులు అందజేశారు. ఐఆర్‌టి కేంద్ర నిర్వాహకులు సత్యనారాయణ, మనం గంగవరం సేవా సంస్థ సభ్యుడు ఇ.రాంప్రసాద్, ఉపాధ్యాయులు పివి. బ్రహ్మానందం, ప్రసాద్, కుందూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో వికలాంగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** స్థానిక భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పిఆర్‌సి.రాజ్ కుమార్ మాట్లాడుతూ వికలాంగులను సమాజంలోని అన్ని రంగాలలోనూ భాగస్వాములు చేయాలని సూచించారు. వికలాంగులకు వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను సిఎంఒ బి.సుబ్రహ్మణ్యం, ఎంఇఒలు కె.కిరణ్ బాబు, ఎస్.సత్యకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎల్.రాణి, ఎన్.సత్యనారాయణ, అమ్మాజీ, శ్యామల, ఐఇఆర్ టీచర్లు సిహెచ్.గంగాదేవి, పి.వెంకటేష్ పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** బండారులంక భవిత కేంద్రంలో వికలాంగదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఇఒ జి.సూర్యప్రకాశం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాల, భవిత కేంద్రం ఉపాధ్యాయుడు శ్రీనివాస్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ రామలక్ష్మి, ఎం కామేశ్వరి, జి నానాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

భూ వివాద రహిత గ్రామాలే లక్ష్యంగా రెవెన్యూసదస్సులు ఈనెల10 నుంచి జనవరి 8 వరకు గ్రామాల్లో నిర్వహించి విజయ వంతం చేయాలని జెసి టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ రెవెన్యూ సదస్సులపై అధికారులతో సమా వేశం నిర్వహించారు ఈ కార్యక్ర మంలో జిల్లాస్థాయి అధికారులు ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. **ఆలమూరు:** ఈనెల 10 నుంచి జనవరి 6 వరకు మండల పరిధి 15 రెవెన్యూ గ్రామాల్లో గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు సోమవారం విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు. ఇవి ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


బాధితులకు దుస్తులు, నిత్యావసరాలు అందజేస్తున్న ఫౌండేషన్ ఛైర్మన్ రజిని

వెంకన్న సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం


మాచరలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఎఐఎస్ఎఫ్ ఉద్యమాల్లో పోరాట ప్రతిమ గల వ్యక్తిగా జిత్తుక వెంకన్న చేసిన సేవలు చిరస్మరణీయమని సిపిఎం సీనియర్ నాయకులు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పెద్దింశెట్టి లెలిన్ బాబు తదితరులు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కపిలేశ్వరపురం దేవి సెంటర్ నాన్ భవిత కేంద్రంలో జిత్తుక వెంకన్న 22వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న చారిటబుల్ , మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు జిత్తుకు మల్లికార్జునుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో కపిలేశ్వరపురం నాన్ భవిత కేంద్రంలోని మానసిక వికలాంగులకు, మాచరలో వృద్ధులకు దుప్పట్లు, అందజేశారు. తొలుత వెంకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ , మాజీ సర్పంచ్ మేక సత్య ప్రసాద్ కమ్మ వెంకట్రావు, జిత్తుక వీర్రాజు, పెద్దింశెట్టి లెలిన్ బాబు, ట్రస్ట్ నిర్వాహకులు జె. మల్లికార్జునుడు, వికలాంగులు వద్ధులు, గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

కపిలేశ్వరపురం: గర్భిణులు ప్రతినిత్యం పౌష్టికాహారం తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ పిఎన్ఎస్ డి.రత్నకుమారి అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభి యాన్ కార్యక్రమంలో భాగంగా సోమ వారం అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు రత్నకుమారి ఆధ్వర్యంలో 24 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులను అందజే శారు. అనంతరం జిత్తుక వెంకన్న 22వ వర్ధంతిని పురస్కరించుకొని అంగర పిహె చ్‌సికి వచ్చిన గర్భిణులకు, బాలింతలకు జిత్తుక వెంకన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలురకాలపండ్లు, పౌష్టి కాహారం కిట్లను అందజేశారు. కార్యక్ర మంలో హెల్త్ విజిటర్ టి.మేరీ మణి, ఎం ఎల్‌హెచ్‌పి కె.రమా దేవి తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** స్థానిక ఏరియా ఆసుపత్రిలో సోమవారం గర్భిణులకు పాలు రొట్టెలు పంపిణీ చేశారు. ప్రతి నెలా9న గర్భిణులకు , బాలింతలకు పోలిశెట్టి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలు రొట్టెలు పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, వాసంశెట్టి సత్యం, జనసేన ఇంచార్జ్ చంద్రశేఖర్, శ్రీనివాస్ పట్టణ జనసేన అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ, జెఎసి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని చింతనలంక గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఆరు కుటుంబాల వారు నిరాశ్రయులైయ్యారు. బాధిత కుటుంబాలకు మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ ఛైర్మన్ పుణ్యమంతుల రజిని ఆధ్వర్యంలో తాళ్ల సుబ్బలక్ష్మి కుమార్తె మోతా దుర్గాదేవి సమకూర్చిన దుప్పట్లు, తువాళ్లు, చీరలు, నిత్యావసర వస్తువులను సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన సంఘటన గురించి రజిని బాధిత కుటుంబాన్ని అడిగి తెలుసుకున్నారు. తమ ఫౌండేషన్ ద్వారా ఆపదలో ఉన్న ఎన్నో బాధిత కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ సభ్యులు తాళ్ల సుబ్బలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు తాళ్ల లలిత, తాళ్ల పద్మ , జనిపెల్ల సీతారత్నం, దోనిపాటి మరియమ్మ, తాళ్ల బేబీ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

వినియోగదారుల చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని వినియోగదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు బళ్లమూడి సూర్యనారాయణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక సాగర్ మున్సిపల్ హైస్కూల్లో జాతీయ వినియోగదారుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన వర్చువల్ విచారణ, డిజిటల్ ప్రయోజనాలపై విద్యార్థులకు వివరించారు. వస్తు సేవలకు సంబంధించి కొనుగోలు చేసినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో హెచ్‌ఎం కెవివిఎస్.ప్రసాద్, ఉపాధ్యాయులు రామలక్ష్మి, ఎం.శివప్రసాద్, బి.పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బెదిరింపులపై ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

నగర పంచా యతీ పరిధిలోని జగనన్న కాలనీలో రెండంతస్తులు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేస్తామని సచి వాలయ సిబ్బంది బెదిరించడాన్ని నిరసిస్తూ కాలనీవాసులు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 50 గజాలు స్థలం ఇచ్చి గృహాన్ని నిర్మించుకోవాలని, లేకుంటే స్థలాన్ని వెనక్కి తీసుకుంటామని గతంలో వాలంటీర్లు బెదిరించే వారన్నారు. దీంతో ప్రభుత్వం కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చిన అప్పులు చేసి మరి గృహాన్ని నిర్మించుకున్నామని చెప్పారు. ఇంటిల్లాపాదికి ఆ గృహం సరిపోకపోవడంతో ఆ పైనే మరో అంతస్తు నిర్మించుకున్నామన్నారు. అయితే ఇప్పుడు ఆ ఇళ్లను కూల్చివేస్తామని సచివాలయ సిబ్బంది బెదిరింపులకు గురి చేయడం ఎంతవరకూ సబబు అని ప్రశ్నించారు. తక్షణమే కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, అధికారుల వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ సత్యనారాయణకు, కౌన్సిలర్ అలమండ చలమయ్యకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం


సమావేశంలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఎస్జిఆర్ఇఎ రాష్ట్ర అధ్యక్షుడు పిఎస్ఎన్ శాస్త్రి డిమాండ్ చేశారు. నగర పంచా యతీ పరిధిలోని స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనం నందు ముమ్మిడివరం యూనిట్ అధ్యక్షుడు రెడ్డి వీరాస్వామి అధ్యక్షతన సోమవారం రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాస్త్రి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చి పరిష్కరించడానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగా గౌరవ హై కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల పై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి నవంబర్ 2024 నుండి అర్హులైన వారి సివిపిని నిలుపు చేయడం సంఘం సాధించిన ఘనత అని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పెద్దిరెడ్డి రామకష్ణారావు, పివివి.సత్యనారాయణ రాజు, ఆర్థిక కార్యదర్శి ఎం.ఆశీర్వాదం, జనిపల్లి సత్యనారాయణ, పేరి కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


సాయంఅందిస్తున్న ఐపిసి సంఘ సభ్యులు

బీ మనవల్లి పంచాయతీ తాడిచెరువుకు చెందిన ఈతకోట లక్ష్మి అనా రోగ్యంతో బాధ పడుతూ అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందు తోంది. ఆమె ఆపరేషన్ నిమిత్తం గొల్లవిల్లి ఐపిసి సంఘ సభ్యులు రూ.16,150 సమకూర్చారు. ఈ ఆర్థిక సాయాన్ని సోమవారం లక్ష్మికి సంఘ పాస్టర్లు పి.స్పర్జన్ ప్రేమ్‌కుమార్, షీభా, లిమూస్, స్టీఫెన్, జె.ప్రసాద్, టి.జాన్సన్, పి.జోయల్ ఫ్రాన్సిస్, జి.జయ దానం, జి.నాని, పి.థామస్ సంఘ పెద్దలు అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఆడిటోరియం హాలు నందు సోమవారం పాలెపు ధర్మారావు అధ్యక్షతన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు మాట్లాడారు. నియోజకవర్గ కన్వీనర్‌గా పాలేపు ధర్మారావును, అలాగే ముమ్మిడివరం మండలానికి దివి వెంకన్న బాబు, అయితా బత్తుల పండు బాబు (కాట్రేనికొన), చిట్టిబాబు(ఐ.పోలవరం), దుర్గా ప్రసాద్(తాళ్లరేవు) లకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పెన్మత్స జగ్గప రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో ప్రథమ స్థానంపై హర్షం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) నిర్వహించిన హౌస్‌హోల్డ్ సర్వే లో మండలం ప్రథమ స్థానంలో నిలవడం పట్ల ఎంపిడిఒ టిఎస్.వెంకటాచారి హర్షం వ్యక్తం చేశారు. ఎన్ పిసిఐ నిర్వహించిన హౌస్ హోల్డ్ ఇమేజ్ క్యాప్చరింగ్ సర్వే లో జిల్లాలోనే ముమ్మిడివరం మండలం ప్రథమ స్థానంలో నిలిచినట్లు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలోనే మండలం 100 శాతం పూర్తి చేసి ప్రథమ స్థానం నిలవడం సాధించే విధంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది చేసిన కృషిని ఎంపిడిఒ అభినందించారు. సర్వే కు సహకరించిన ప్రజలకు ఎంపిడిఒ కృతజ్ఞతలు తెలిపారు.

వెంకన్నను దర్శించుకున్న నటుడు శుభలేఖ సుధాకర్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని సోమవారం ప్రముఖ సినీ నటుడు శుభలేఖ సుధాకర్ దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందజేశారు. అనంతరం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామిని నటుడు శుభలేక సుధాకర్ దర్శించుకున్నారు. వీరికి ఇఒ బివి.రమణమూర్తి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.